

సాక్షి
గుంటూరు

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



సందర్శకులకు అనుమతి
యడ్లపాడు: కొండవీడు కోటకు సందర్శకులను ఆదివారం నుంచి అనుమతించనున్నారు. విరిగి పడిన బండరాళ్ల తొలగింపు పనులు శనివారం చేపట్టారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: సాగర్ నీటి మట్టం శనివారం 522.30 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 23,030 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీకి 1,350 విడుదల చేస్తున్నారు.

సత్రశాలలో కార్తిక పూజలు
రెంటచింతల: పల్నాడు జిల్లా సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శనివారం కార్తిక పూజలు నిర్వహించారు. కృష్ణానది ఒడ్డున కార్తిక దీపాలు వెలిగించి పుణ్య స్నానాలు చేశారు.



న్యూస్‌రీల్

పల్నాటి ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలకు కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆహ్వానించారు. పల్నాటి ఉత్సవాల ఆహ్వాన పత్రికను కలెక్టరేట్‌లో పీఠాధిపతి శనివారం అందించారు. 12వ తేదీ నుంచి పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని పీఠాధిపతి తెలిపారు. గత ఏడాది మందపోరు నాడు బ్రహ్మనాయుడు చాపకూడు సహపంక్తి భోజనాల అమలు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్ కుమార్ కూడా పీఠాధిపతి వెంట ఉన్నారు.


అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో శనివారం దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్షబిల్వార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. ఆలయ వేదపండితులు తొలుత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం రుద్రహోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేషాలంకారం చేసి సహస్రనామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వాదళార్చన నిర్వహించారు. బాలచాముండేశ్వరిదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రేపటి నుంచి టీకాల కార్యక్రమం
నరసరావుపేట: మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలకు ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు టీకాలు వేయనున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బి.రవి శనివారం తెలిపారు. ఆశ కార్యకర్తలు టీకాలు సక్రమంగా తీసుకోని వారిని గుర్తించినట్లు చెప్పారు. అందులో 64 మంది గర్భిణులు, 594 మంది పిల్లలు ఉన్నట్లు వివరించారు. ముఖ్యంగా సంచార జాతులు, కర్మాగారాల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల పనివారు, వలస కూలీలు, పట్టణ మురికివాడలలో నివసిస్తున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం జరుగుతుందని పేర్కొన్నారు. తల్లులు తమ బిడ్డలకు టీకాలు ఇప్పించి వారిని ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన కేంద్ర బృందం



తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరంలోని పట్టాభిరామయ్య కాలనీ, గండాలయ్య పేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర శిశు సంక్షేమ శాఖ బృందం శనివారం పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, చిన్నారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిస్తున్న పౌష్టికాహారం, నిర్వహణను పరిశీలించారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి కేంద్రం నుంచి వచ్చిన శిశు సంక్షేమ శాఖ కేంద్ర బృందానికి ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్ర బృందంతో పాటు తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు

- ఆ ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
- ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు
- ఎన్నికల హామీలు 99 శాతం అమలు
- వెనుకబడిన వర్గాల ఉన్నతికి 56 కార్పొరేషన్లు ఏర్పాటు



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, వేదికపై వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, సమాచార శాఖ కమిషనర్ శామ్యూల్ తదితరులు

నగరంపాలెం(గుంటూరువెస్ట్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. అవర్ స్టేట్– అవర్ లీడర్ వైఎస్సార్ ఇంటిలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో గుంటూరు ఎన్‌జీఓ కాలనీలోని మహాత్మాగాంధీ కళాశాల ఆవరణలో 'కుల గణన'పై చర్చ కార్యక్రమం, సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం అనే అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు శాంతమూర్తి అధ్యక్షత వహించారు. కొమ్మినేని మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంపై ఈనాడు, ఆంధ్రజ్యోతి, మీడియా సంస్థలు అబద్ధపు వార్తలను పుంఖాను పుంఖాలుగా రాస్తున్నాయని మండిపడ్డారు. రోజు రోజుకి దిగజారి వార్తలు వస్తున్నాయని విమర్శించారు. చివరికి కొన్ని మీడియా సంస్థలు ఉగ్రవాద సంస్థలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభూత కల్పనతో ఈనాడు, ఆంధ్రజ్యోతి అబద్ధపు వార్తలను అచ్చువేస్తున్నాయని విమర్శించారు. అటువంటి వార్తలను కళ్లు ఉండి రాస్తున్నారా లేక రాస్తున్నారా అనేది అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దుష్ట పాలన సాగుతుందని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారని, చంద్రబాబు 92 శాతం హామీలను అమలు చేయలేదని పేర్కొన్నారు.

కుల గణనతో మేలు..

కుల గణనతో మేలు జరుగుతుందనే ఒక మంచి ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని కొమ్మినేని చెప్పారు. ఏపీలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం రికార్డు అని, దేశ చరిత్రలో ఎప్పుడు లేదని వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కుల గణన చాలా అవసరమని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ చొరవ అభినందనీయమని అన్నారు. సమాచార కమిషనర్ జొనాధన్ శామ్యూల్ మాట్లాడుతూ కులం, పుట్టుకపై ప్రపంచంలో ఎవరూ చేయని విధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరిశోధన చేశారని అన్నారు. సీఎం వైఎస్ జగన్ కుల గణన చేపట్టడం శుభపరిణామమని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయం తీసుకొచ్చారని పేర్కొన్నారు. దళిత ఎమ్మెల్యేలు హోం మంత్రులుగా పదవులు చేపట్టడం, కార్పొరేషన్ల చైర్మన్లుగా నియమించి దాదాపు 70 శాతం సామాజిక న్యాయం చేశారని అన్నారు. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కులగణన చాలా అవసరమని అన్నారు. మహాత్మాగాంధీ కళాశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సామాజిక న్యాయం చేయాలంటే కుల గణన తప్పనిసరి అని పేర్కొన్నారు. కుల గణన చేపట్టేందుకు ముందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు అభినందనలు చెప్పారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏపీలో సాధికారితను అమలు చేశారని అన్నారు. తద్వారా అట్టడుగు వర్గాలను ముందుకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు. విశ్రాంత ఎస్పీ చన్నంశెట్టి చక్రపాణి, హ్యూమన్‌రైట్స్ కమిషన్ సభ్యులు డీఆర్ శ్రీనివాసరావు, జీఎంసీ డెప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ బూసి రాజలత, వైఎస్సార్ సీపీ నాయకులు రోజారాణి, డాక్టర్ శ్రీనివాసరావు, కె.రవికుమార్, తిలక్ ప్రసంగించారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

ఎస్ఎస్ఆర్ 2024 జిల్లా రోల్ అబ్జర్వర్ బి.శ్రీధర్



మాట్లాడుతున్న బి.శ్రీధర్, వేదికపై కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతోపాటు, మృతిచెందిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించాలని ఎస్ఎస్ఆర్– 2024 జిల్లా రోల్ అబ్జర్వర్ బి.శ్రీధర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీధర్ మాట్లాడుతూ డబుల్ ఎంట్రీలు, అర్హత లేనివారికి గానీ ఓటు ఉండకూడదని చెప్పారు. తుది జాబితా తయారయ్యేనాటికి ఎటువంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా ప్రజలకు అందజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ల జాబితాకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. క్షేత్రస్థాయిలోని బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది పూర్తి స్థాయిలో విచారించారని చెప్పారు. జిల్లాలో పార్లమెంట్, ఏడు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయని, ఎస్ఎస్ఆర్– 2024 డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 17,35,619 మంది ఓటర్లు ఉన్నారని, ఈపీ రేషియో 716, జండర్ రేషియో 1066 ఉందని పేర్కొన్నారు. 18 –19 వయస్సు ఉన్న యువ ఓటర్లుగా నమోదు చేయడానికి జిల్లాలోని 322 కళాశాలల్లో చీఫ్ యాక్టివిటి ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో 13 వేల మందితో ఓటు హక్కుకు దరఖాస్తు చేయించడం జరిగిందన్నారు. ఓటర్ల క్లెయిమ్స్‌కు సంబంధించి 3,83,325 అందాయన్నారు. వీటిలో 3,22,816 పరిష్కరించామని పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తమ సూచనలు, సలహాలను కార్యక్రమంలో వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీఓ శ్రీకర్, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, తూర్పు నియోజకవర్గం నేత షేక్ నూరిఫాతిమాలు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు.

లోక్ అదాలత్‌తో 2023 కేసులు పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.జి.పార్థసారథి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

పట్నంబజారు: జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. గుంటూరులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.జి.పార్థసారథి మాట్లాడుతూ కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకుని తమ సమయాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహించే సమయంలో సమస్యలు ఉంటే కక్షిదారులు తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌తో క్రిమినల్, సివిల్, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 444 సివిల్, 1490 క్రిమినల్, 89 ప్రిలిటిగేషన్ కేసులు మొత్తం 2,023 కేసులు పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సహకరించిన న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ సంస్థలు, కక్షిదారులు, న్యాయస్థాన సిబ్బందికి న్యాయసేవాధికార సంస్థ తరఫున సంస్థ కార్యదర్శి టి.లీలావతి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం

18 జిల్లాల నుంచి జట్ల రాక



షూటింగ్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న అసోసియేషన్ నాయకులు

మార్టూరు: రాష్ట్ర స్థాయి 42వ షూటింగ్ బాల్ అండర్–19 పోటీలు శనివారం ప్రారంభించారు. వివేకానంద నెక్స్ట్ జెన్ పాఠశాలలో నిర్వహించిన పోటీలకు 18 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు. మొదటి రోజు బాలికల విభాగంలో గుంటూరు, ప్రకాశం జిల్లా, విశాఖ, చిత్తూరు జిల్లాలు, అనకాపల్లి కడప జిల్లా మధ్య పోటీలు నిర్వహించగా గుంటూరు, చిత్తూరు, అనకాపల్లి జిల్లాల జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో అసోసియేషన్ సంఘం ఉపాధ్యక్షుడు మహేష్, బాపట్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఐ బాబురావు, ఉపాధ్యక్షులు వి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రైతు బాంధవుడు జగనన్న

- మిచాంగ్ తుఫాన్‌ను సమర్థంగా అధిగమించారు
- ఉనికి కాపాడుకునేందుకే చంద్రబాబు కుటిల యత్నాలు
- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



రేపల్లె రూరల్: రైతు పక్షపాతి, రైతు బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రేపల్లె పట్టణంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మిచాంగ్ తుఫాన్‌తో పంట దెబ్బతినటంతో రైతులు నష్టపోయారని, రైతాంగాన్ని సీఎం వైఎస్ జగన్ ఆదుకుంటారని అన్నారు. వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలతో ముందస్తు ఆయా ప్రాంతాలకు అత్యవసర నిధులు మంజూరు చేసి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా సీఎం చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. పంట బాగా దెబ్బతిన్న ప్రాంతాలలో సీఎం జగనన్న పర్యటించి పంటను పరిశీలించి రైతులకు నష్టపరిహారాన్ని సంక్రాంతి పండగ నాటికి అందజేస్తానని భరోసా ఇచ్చారని చెప్పారు.

కరువు, చంద్రబాబు కవలలు..

కరువు, చంద్రబాబు నాయుడు కవల పిల్లలు వంటి వారన్న నానుడి ప్రజల్లో ఉందని ఎంపీ చెప్పారు. చంద్రబాబు పాలనా కాలంలో చుక్కనీరు అందక పంటలు ఎండిపోయిన పరిస్థితులు ఉన్నాయని గుర్తు చేశారు. 14 సంవత్సరాల పాలనా కాలంలో చంద్రబాబు రైతుల కోసం సానుకూలంగా ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. నాడు వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు, నేడు రైతుల కోసం మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. కేవలం తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే మాట్లాడుతున్నారని, పదవి కోసం పగటి కలలు కంటున్నారన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

- యోగా ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి
- యోగా, క్రీడా రంగ అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం ప్రత్యేక కృషి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- ఏఎన్‌యూలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం



ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి

ఏఎన్‌యూ: యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న నాల్గవ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలను అప్పిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ ప్రస్తుత సమాజంలో యోగా ఆవశ్యకత మరింత పెరిగిందన్నారు. రోజువారీ జీవితం, విధినిర్వహణలో మనిషి నిత్యం తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నాడని దానిని అధిగమించేందుకు యోగా అత్యుత్తమ మార్గమన్నారు. యోగా ద్వారా మనం మానసిక ఆరోగ్యంతోపాటు, శారీరక ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చన్నారు. యోగా ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. యోగా రంగ నిపుణులు, అధ్యాపకులు యోగాపై సమాజంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. యోగా, క్రీడా రంగ అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఏపీని సంపూర్ణారోగ్యాంధ్రగా మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. యోగాకు సంబంధించిన అంశాలకు పూర్తి సహకారం అందించేందుకు తాను కూడా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. గుంటూరు వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ ఎం విష్ణువర్ధన్‌రావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, విజయ డెయిరీ చైర్మన్ సీహెచ్ ఆంజనేయులు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.జాన్సన్, లీగల్ అడ్వయిజర్ గొట్టిపాటి వెంకట శివరామకృష్ణ ప్రసాద్, గురూజీ బిక్షమయ్య, యోగ అసోసియేషన్ సభ్యులు ఎం రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ బాలు, జి వెంకట రామకృష్ణప్రసాద్, జి అనిల్, బైసు మల్లికార్జున, రాష్ట్ర భారత స్వాభిమాన్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ దుర్గారావు గురూజీ, కృష్ణా జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కే సాయి, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఆళ్ల రాజేశ్వరరావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ యోగ కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది నుంచి 55 సంవత్సరాల వయసు వరకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ కేటగిరిలో ట్రెడిషనల్, ఆర్టిస్ట్ సోలో, ఆర్టిస్ట్ ఫెయిర్, రిథమిక్ పెయిర్‌లో పోటీలు జరుగుతాయని, పోటీల్లో 453 మంది పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు.

వస్త్ర పరిశ్రమను కాపాడేందుకు చర్యలు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి



మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే వసంత తదితరులు

నగరంపాలెం: దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి, ఈ రంగం అభ్యున్నతికి చర్యలు చేపట్టాలని కోరుతూ.. నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కేంద్ర మంత్రికి వినతిపత్రం అందించిన వారిలో అసోసియేషన్ సభ్యులు కోటిరావు, రఘురామిరెడ్డి, పున్నయ్య చౌదరి, బెనర్జీ, పృథ్వీ ఉన్నారు.

విద్యార్థులకు కొత్త పుస్తకాలు అందజేత



వేమూరులో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ప్రవీణ్‌ప్రకాశ్

వేమూరు/కొల్లూరు/భట్టిప్రోలు: మిచాంగ్ తుఫాన్ వల్ల ఇళ్లలోకి నీరు చేరి తడిసిపోయిన విద్యార్థుల పాఠ్య పుస్తకాలకు బదులు ప్రభుత్వం నూతన పుస్తకాలను అందజేసింది. శనివారం వేమూరు అంబేద్కర్ నగర్, కొల్లూరు మండలం తోకలవారిపాలెం, భట్టిప్రోలు మండలం ఆళ్లమూడి గ్రామంలోని విద్యార్థుల ఇళ్ల వద్దకే వెళ్లి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ పాఠ్యపుస్తకాలు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. పాఠ్య పుస్తకాల డైరెక్టర్ రవీంద్రరెడ్డి, జిల్లా విద్యా శాఖాధికారి పీవీజే రామారావు, ఉప విద్యా శాఖాధికారి వెంకటేశ్వర్లు, నాడు–నేడు నియోజకవర్గం ప్రత్యేకాధికారి జోత్స్న, వేమూరు ఎంఈఓ–1 వెంకటేశ్వర్లు, విద్యా శాఖ అధికారి రోజ్ ల్యాండ్, భట్టిప్రోలు ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజులు, కోనేటిపురం గ్రామ సర్పంచ్ పెద్దిశెట్టి రాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.పద్మావతి, కొల్లూరు ఎంఈఓలు వెంకటేశ్వరరావు, జ్యోతి పాల్గొన్నారు. తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్ నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు.

క్లుప్తంగా

సివిల్ ఇంజనీర్స్ ఇండియా 46వ శాఖ ప్రారంభం

నెహ్రూనగర్: అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా 46వ శాఖ శనివారం గుంటూరులో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విజయవాడ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీన్ బి. పాండురంగారావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ గుంటూరు సర్కిల్ ఆర్ అండ్ బీ ఆర్.శ్రీనివాసమూర్తి పాల్గొని ప్రారంభించారు. గుంటూరు సెంటర్ చైర్మన్ ఎం.ఆర్.కె. పరమహంస మాట్లాడుతూ సెంటర్ ద్వారా సివిల్ ఇంజనీర్స్‌కు వృత్తిపై అవగాహనతో పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సివిల్ ఇంజనీర్స్ ప్రాముఖ్యతను ముందు తరాలకు తెలియజేయాలన్న లక్ష్యంతో సంస్థ దేశవ్యాప్తంగా పని చేస్తోందని తెలిపారు. దానిలో భాగంగానే గుంటూరులో సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో లైసెన్స్ ఇంజనీర్స్‌కు వృత్తిలో తోడ్పాటునందిస్తూనే వారు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేందుకు, వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించేందుకు అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా గుంటూరు శాఖ పని చేస్తుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ శ్రీనివాసన్, సౌత్ వైస్ ప్రెసిడెంట్ కె.రాజకుమారి, జనరల్ సెక్రటరీ రాజేంద్ర కల్ బావి, కాకినాడ సెంటర్ చైర్మన్ బాదం శ్రీనివాసరావు, సెక్రెటరీ దుర్గాప్రసాద్, ట్రెజరర్ భాస్కరరావు, సెక్రెటరీ కె.పానకాలు, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ డి.బాలాజీ, జి.ఎస్.వి.కృష్ణకాంత్, టి.సుధీర్ పాల్గొన్నారు.

కాకాని శివాలయంలో ప్రముఖుల పూజలు


న్యాయమూర్తి అర్చన దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న పాలకవర్గం చైర్మన్


హైకోర్టు రిజిస్ట్రార్ ఏడుకొండలు దంపతులకు ఆశీర్వచనం అందజేస్తున్న ప్రధాన అర్చకుడు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మూడవ అదనపు గుంటూరు జిల్లా కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. అర్చన దంపతులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు(ఐటీ) రిజిస్ట్రార్ ఏడుకొండలు దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావుతో పాటు అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకం, పూజలు నిర్వహించారు. అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. దంపతుల్ని స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.

భారీగా తరలి వచ్చిన భక్తులు

కార్తిక మాసం చివరి శనివారం ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాకార మండపంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. శ్రీభ్రమరాంబ అమ్మవారిని, మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వరద నీటిని వెంటనే బయటకు పంపాలి

రైతులకు డీఏవో నున్న వెంకటేశ్వర్లు సూచన


లింగంగుంటపాలెంలో రైతులతో మాట్లాడుతున్న డీఏవో

కాకుమాను : మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీటిని రైతులు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సహాయంతో సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) నున్న వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని లింగంగుంటపాలెం, వల్లూరు, చినలింగాయపాలెం గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాల్ని శనివారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఎకరాను వ్యవసాయ సిబ్బంది పరిశీలించి, పంట నష్టపోయిన ప్రతి రైతు పేరు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు చంద్రశేఖరరెడ్డి, వింతా రాఘవరెడ్డి, యోహోను, పొన్నూరు ఏడీఏ వి.రామకోటేశ్వరి, ఏవో కె.కిరణ్మయి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుల భద్రతే లక్ష్యం

- ప్రయాణికులకు అవగాహనతోనే రైలు ప్రమాదాలకు అడ్డుకట్ట
- రక్షణ, సిగ్నలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి
- సికింద్రాబాద్ సర్కిల్ రైల్వే సేఫ్టీ ఆఫ్ కమిషనర్ మాధవి



గుంటూరు రైల్వే స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలిస్తున్న సేఫ్టీ ఆఫ్ కమిషనర్ మాధవి, ఏడీఆర్ఎం శ్రీనివాస్, సైమాన్ తదితరులు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని స్టేషన్లలో ప్రమాదాల్ని అరికట్టేందుకు గానూ ప్రయాణికులకు వాటిపై అవగాహన కల్పించి చైతన్యాన్ని తీసుకురావాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ సర్కిల్ రైల్వే సేఫ్టీ ఆఫ్ కమిషనర్ మాధవి తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థ, రక్షణ తీరును శనివారం ఆమె గుంటూరు డివిజన్ అధికారులతో కలసి తనిఖీ చేశారు. ముందుగా ఆమె సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వచ్చే శబరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రక్షణపై నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు. బోగీల్లో కిటికీల వద్ద కూర్చునే ప్రయాణికులకు జాగ్రత్తలపై కచ్చితంగా అవగాహన కల్పించాలని తెలిపారు. పలు ప్రాంతాల్లో నాటకాలు, కరపత్రాల ద్వారా భద్రత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానంగా రైలులో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలిగించరాదని, రైల్వే అధికారులు కూడా దురుసుగా వ్యవహరించరాదని తెలిపారు. రైల్వేస్టేషన్లతో పాటు రైలులో రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అధికారులకు సూచించారు. దక్షిణ మధ్య రైల్వేలో సిగ్నలింగ్ వ్యవస్థను మరింత ఆధునీకరించాలని చెప్పారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్ఎం రామకృష్ణ, ఏడీఆర్ఎం సైమాన్, ఆర్.శ్రీనివాస్, సీనియర్ డీవోఎం కిరణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ బి.లక్ష్మణ్, డీఎస్‌వో విజయకీర్తి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను శ్రద్ధగా చదివించండి

- రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్
- తుఫాన్ బాధిత విద్యార్థులకు కొత్త పుస్తకాలు
- విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అందజేసిన వైనం


కర్లపాలెం ఇందిరానగర్‌లో విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

కర్లపాలెం: తల్లిదండ్రులు విద్యార్థుల్ని శ్రద్ధగా చదివించాలని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల కర్లపాలెంలో పూరిళ్లలోకి నీరు చేరి పుస్తకాలు తడిచిన విద్యార్థుల ఇళ్లకు శనివారం ఆయన వెళ్లారు. తడిచిన పుస్తకాలు పరిశీలించి , కొత్త పుస్తకాలు అందజేశారు. కర్లపాలెం అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి సంజీవులు, ఇందిరానగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 2వ తరగతి విద్యార్థి యశ్వంత్‌కుమార్‌కు, 3వ తరగతి చదువుతున్న అయ్యప్పకు, పాతనందాయపాలెంలో 5వ తరగతి చదువుతున్న మహేశ్వరరెడ్డికి, గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సౌమ్యకు, మర్రికట్టవ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఉమామహేశ్వరరావుకు ప్రవీణ్ ప్రకాష్ స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి కొత్త పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని చెప్పారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారని తెలిపారు. అయితే, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు సక్రమంగా బడికి వెళుతున్నారా.. పాఠాలు చదువుతున్నారా ? అని ప్రతిరోజూ పరిశీలించాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ప్రతిరోజూ ఉదయం సాయంత్రం చదువుకోవడం, హోంవర్క్ పూర్తి చేయడం లాంటివి తల్లిదండ్రులే అలవాటు చేయాలని చెప్పారు. 'మీ కష్టాలు మీ పిల్లలకు రాకుండా ఉండాలంటే వారిని శ్రద్ధగా చదివించాల'ని తల్లిదండ్రులకు సూచించారు. ప్రవీణ్ ప్రకాష్ వెంట బాపట్ల డీఈవో పీవీజే రామారావు, డెప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు, బాపట్ల ఎంఈవో ప్రసాద్, కర్లపాలెం ఎంఈవోలు టీయూ మనోరంజని, విజయశ్రీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

తెలుగు మహాసభల జిల్లా సంచాలకుడిగా పేరిరెడ్డి



ఇంకొల్లు (చినగంజాం): రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు-2024 బాపట్ల జిల్లా ఉత్సవ కమిటీ సంచాలకుడిగా ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి ఎంపికయ్యారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు 2024 జనవరి 5,6,7 తేదీల్లో రాజమహేంద్రవరంలోని గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ప్రధాన సంచాలకులు కేశిరాజు రామప్రసాద్ నుంచి ఆదేశాలు అందినట్లు తెలిపారు.

తల్లి మందలించిందని యువతి బలవన్మరణం

నాదెండ్ల: తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన యువతి బలవన్మరణానికి పాల్పడి, గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన నావూరి శివ కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఆయనకు ఇరువురు కుమార్తెలు. రెండో కుమార్తె అఖిల (19) డిగ్రీ పూర్తి చేసి చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఈ నెల 3న డ్యూటీకి వెళ్లకపోవటంతో తల్లి మందలించింది. అదేరోజు ఉదయం 9.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందును కూల్‌డ్రింక్‌లో అఖిల కలుపుకుని తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, శనివారం ఉదయం 9.30 గంటలకు మరణించింది. తండ్రి శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం అప్పగించారు.